
# కొందరికే రుణమాఫీ




మేడ్చల్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న రైతులకు నిరుత్సాహమే మిగులుతున్నది. మేడ్చల్ జిల్లాలో అర్హులు సుమారు 20 వేల పైచిలుకు ఉన్నా.. ఇప్పటి వరకు 3,091 మందే లబ్ధి పొందారు. జిల్లా వ్యాప్తంగా అన్నదాతల అకౌంట్లలో రూ. 17 కోట్లు జమ అయినట్లు అధికారులు సమాచారం ఇచ్చినా.. ఇందులో ఎంత వరకు నిజమన్నది స్పష్టంగా తెలియడం లేదు. రుణమాఫీ వర్తింపు కాని వారు సహకార సంఘాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతున్నదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని సహకార సంఘాలతో పాటు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీలో ఫిర్యాదులు చేసినా.. సమస్య పరిష్కారం కావడం లేదంటున్నారు. జిల్లాలో మొదటి విడతలో (రూ. లక్ష ) 2,669, రెండో విడత (రూ. లక్ష 50 వేలు)లో 856 మంది రైతులకు మాత్రమే రుణమాఫీని ప్రభుత్వం వర్తింపజేసింది.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, ఆదివారం 4 ఆగస్టు 2024 HYDERABAD



# 100% మురుగు శుద్ధి

## కేసీఆర్ ప్రణాళికలు కార్యరూపం



సిటీబ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఉత్పత్తి అవుతున్న మురుగునీటిని వంద శాతం శుద్ధి చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలు ఎట్టకేలకు కార్యరూపంలోకి రానున్నాయి. నగర వ్యాప్తంగా 39 ఎస్టీపీలను రూ. 3800 కోట్లతో నిర్మించనున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ ప్రోగ్రాం కింద నిధులు కేటాయించేందుకు ఇప్పటికే అనుమతి పొందగా, తాజాగా రాష్ట్ర పురపాలక శాఖ కూడా పాలనపరమైన అనుమతులు ఇచ్చింది. దీంతో నగరంలో ఎస్టీపీల నిర్మాణ పనులు వేగంగా జరగనున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో రూ. 3,866 కోట్ల వ్యయంతో 31 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టి ఇందులో ఏడింటిని వినియోగంలోకి తీసుకొచ్చింది. కాంగ్రెస్ సర్కారు ఇటీవల రెండింటిని ప్రారంభించి, మరో రెండు ఎస్టీపీలకు ట్రయల్ రన్ నిర్వహించింది. మిగిలిన ప్రాంతాల్లో పలు దశల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ 31 ఎస్టీపీల ద్వారా 1260 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేసుకునే వీలు ఉంది. దీనికి అదనంగా 965 ఎంఎల్‌డీల మురుగునీటిని శుద్ధి చేసేలా మరో 39 ఎస్టీపీలకు గతంలోనే కేంద్ర పట్టణ మంత్రిత్వ శాఖ అమృత్ పథకం కింద ఆమోదం తెలిపింది. హెచ్ఏఎం విధానంలో చేపట్టబోయే ఈ ఎస్టీపీలకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా శనివారం పాలనపరమైన అనుమతులు జారీ చేసింది.

ఎట్టకేలకు 39 ఎస్టీపీలకు దొరికిన ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వ పాలన అనుమతులు

ఇప్పటికే అమృత్ 2.0 ద్వారా రూ.3849 కోట్ల నిధులు

ప్రాజెక్టు వివరాలు..

| | ప్రాజెక్టు 1 | ప్రాజెక్టు 2 |
|---|---|---|
| కేంద్రం వాటా(30%) | 328.39 | 316.64 |
| రాష్ట్ర వాటా(30%) | 453.59 | 443.31 |
| పీపీపీ, హామ్ వాటా(30%) | 521.30 | 506.60 |
| మున్సిపాలిటీలు నిర్వహణ | 641.39 | 639.90 |
| ప్రాజెక్టు వ్యయం | 1942.66 | 1906.44 |

### రెండు ప్యాకేజీల్లో..

అమృత్ 2.0 ద్వారా 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించేందుకు రూ. 3849 కోట్ల నిధులు కేటాయించారు. ఓఆర్ఆర్, జీహెచ్ఎంసీ, మూసీ నది ప్రక్షాళనతోపాటు శివారుల్లో ఉన్న పురపాలక సంస్థల కోసం వీటిని నిర్మించనున్నారు. మొత్తం 39 ఎస్టీపీల నిర్మాణానికి కేంద్రం 30, రాష్ట్ర ప్రభుత్వం 30, పీపీపీ విధానంలో 40శాతం చొప్పున నిధులను వెచ్చించనున్నారు. రెండు ప్యాకేజీల్లో ఈ ఎస్టీపీలను నిర్మించేందుకు చర్యలు చేపట్టగా... 100 శాతం మురుగు నీటిని శుద్ధి చేసుకునే వీలుంటుందని అధికారులు పేర్కొన్నారు.

### కేసీఆర్ కృషి..

శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో మురుగు నీటి నిర్వహణ అత్యంత కీలకంగా మారింది. ఈ క్రమంలోనే నిజాం కాలం నాటి డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలను రూపొందించింది. ఇందులో భాగంగా తొలుత రాష్ట్ర ప్రభుత్వమే 31 ఎస్టీపీల నిర్మాణాలను మొదలుపెట్టింది. వీటికి అదనంగా కేంద్ర సర్కారు ఇచ్చే ప్రోత్సాహకాలను కూడా సద్వినియోగం చేసుకుని, ఓఆర్ఆర్, మూసీ, కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ మురుగు నీటిని శుద్ధి చేసే విధంగా ఎస్టీపీలకు ప్రణాళికలు రూపొందించింది. అమృత్ పథకం కింద అనుమతులు పొందింది. ఇలా వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేసుకునే స్థాయికి నగరం చేరుకోవడంలో గత సీఎం కేసీఆర్ చేసిన కృషి ఎంతో ఉంది.

# ఫేక్ డాక్యుమెంట్లతో ₹20 కోట్ల స్థలానికి ఎసరు!

## చనిపోయిన మహిళ పేరిట నకిలీ పత్రాలు

రిజిస్ట్రేషన్ చేసేసిన సబ్ రిజిస్ట్రార్

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కేసు వివరాల వెల్లడిలో గోప్యతపై అనుమానాలు

'కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రేషన్'లో మరో ఉదంతం

*కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తవ్వే కొద్దీ దొంగ రిజిస్ట్రేషన్ల ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ప్రగతినగర్‌కు చెందిన ఓ మహిళకు సంబంధించిన ఇంటి స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి స్వాహా చేసిన ఘటన మరువకముందే.. బౌరంపేట్‌లో అలాంటిదే మరొకటి వెలుగులోకి వచ్చింది. ఈసారి ఏకంగా చనిపోయిన మహిళ పేరిట ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేసి.. ఆమెకు చెందిన రూ. 20 కోట్ల విలువైన 1950 గజాల స్థలాన్ని కాజేశారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసినా.. కేసును వెలుగులోకి రాకుండా ప్రయత్నించడం..అధికారులు సైతం డాక్యుమెంట్లు పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ చేయడం.. పలు అనుమానాలకు తావిస్తున్నది. -దుండిగల్, ఆగస్టు 3*

**బౌరంపేట్** రెవెన్యూ పరిధిలో 1984లో సతీశ్ సొసైటీ పేరిట వేములపల్లి సీతారామయ్య అనే వ్యక్తి వెంచర్ చేశారు. ఇందులో 1988లో సర్వసాయికుమారి అనే మహిళ 1950 గజాల (మొత్తం 6 ప్లాట్లు) స్థలాన్ని కొనుగోలు చేశారు. తన పేరిట 25/2/1988న రిజిస్ట్రేషన్(డాక్యుమెంట్ నంబర్ 1148/1988) చేసుకున్నారు. అనంతరం ఆమె తన భర్త మల్లికార్జున్‌శాస్త్రితో కలిసి బ్రెజిల్ వెళ్లారు. 2001లో అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ చనిపోయారు. వారి కుమారుడు కిరణ్‌బాబు నగరంలోని నానక్‌రాంగూడలో స్థిరపడ్డారు. అప్పుడప్పుడు సతీశ్ సొసైటీలో ఉన్న తన ప్లాట్లను చూసి వెళ్లేవారు. గతేడాది జూలై 10న తన స్థలం వద్దకు కిరణ్‌బాబు వెళ్లగా, అక్కడ రెండు రేకుల షెడ్లు కనిపించాయి. ఆందోళనకు గురైన అతను సూరారంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి..వాకబు చేయగా, లంగర్‌హౌజ్‌లో నివాసముంటున్న చిట్టినీడి శేఖర్‌బాబు(37) పేరిట 11/07/2019న సర్వసాయికుమారి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. దీంతో కిరణ్‌బాబు ఆగస్టు 12, 2023న దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో దిమ్మతిరిగి పోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

### ప్లాట్లకు డిమాండ్ ఏర్పడటంతో..

ఇటీవల కాలంలో సతీశ్ సొసైటీలోని ప్లాట్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. అక్కడ స్థలాలు కొన్న కూకట్‌పల్లి, బాలాజీనగర్‌లో నివాసముండే కొన్నెగంటి శ్రీనివాసరావు(55)కు ఖాళీగా ఉన్న సాయికుమారికి చెందిన 6 ప్లాట్లపై కన్నుపడింది. ఎలాగైనా సదరు స్థలాన్ని స్వాహా చేయాలని భావించి.. తనకు పరిచయమున్న శేఖర్‌బాబుతో కలిసి 2019లోనే కుత్బుల్లాపూర్ ఎస్ఆర్‌వో కార్యాలయం నుంచి సర్టిఫైడ్ కాపీలు తెప్పించుకున్నారు. సదరు స్థిరాస్తిని తమ పేరుపై మార్చుకోవాలనే ఉద్దేశంతో చంచల్‌గూడకు చెందిన ఇక్బాల్ అలీఖాన్‌ను కలిశారు. అతడి సలహా మేరకు ఆ స్థలాన్ని ఇమంది నారాయణ రావు(40) అనే వ్యక్తి పేరిట స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఎస్‌పీఏ)గా ఇచ్చినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. సాయికుమారిగా మరో మహిళను చూపించి.. నకిలీ పాస్‌పోర్ట్‌ను సైతం సృష్టించారు. జూలై 19, 2019న ఎస్‌పీఏ(డాక్యుమెంట్ నంబర్ 5383/6/ వీఏ1/2019) పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. దానిని శేఖర్‌బాబుకు విక్రయించినట్లు మరో రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత శేఖర్‌బాబు 1950 గజాలను పలువురికి విక్రయించి, సొమ్ము చేసుకున్నట్లు తేలింది. నకిలీ డాక్యుమెంట్లు చేయించి ఇచ్చిన ఇక్బాల్ అలీఖాన్‌కు రూ. 20 లక్షలు ఇచ్చిన నిందితులు.. ప్లాట్లు విక్రయించగా.. వచ్చిన సొమ్మును శేఖర్‌బాబు, శ్రీనివాసరావు, ఇమంది నారాయణరావు పంచుకున్నారు. 2001లో చనిపోయిన సర్వసాయికుమారి 2019లో తన ప్లాట్లను ఎలా విక్రయించారు.. అనే పాయింట్‌లో పోలీసులు విచారణ చేయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 4న శేఖర్‌బాబు, శ్రీనివాసరావులను అరెస్ట్ చేసిన పోలీసులు.. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. కాగా, అయితే ఇన్ని రోజులు నిందితుల వివరాలను బయటకు పొక్కనీయకపోవడానికి గల కారణాలు ఏమిటీ...? చిన్న ఘటన జరిగితేనే మీడియా సమావేశాలు పెట్టే పోలీసులు.. ఈ కేసులో మాత్రం వివరాలు వెల్లడించకుండా గోప్యత పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు సైతం నకిలీ డాక్యుమెంట్లను గుర్తించకుండా రిజిస్ట్రేషన్ చేయడం అనేక సందేహాలకు తావిస్తున్నది.


ఉప్పల్ మెట్రో డిపో పక్కన ఖాళీ స్థలం

*ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలుకు ఖ్యాతి ఉన్నది. ఇంతటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం సుమారు 290 ఎకరాలను నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్‌కు కేటాయించింది. హెచ్‌ఎంఆర్ నినాదం రవాణా ఆధారిత అభివృద్ధి, అయితే ఇప్పటికీ సంస్థ వద్ద 50 ఎకరాలకు పైగా ల్యాండ్ బ్యాంక్ ఉన్నది. అందులో వ్యాపార, వాణిజ్య భవనాల నిర్మాణాలు చేపట్టి.. అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉన్నా.. ఆ దిశగా 'హైదరాబాద్ మెట్రో' అడుగులు వేయడంలేదు. - సిటీబ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ)*

# నిరుపయోగంగా మెట్రో భూములు

మియాపూర్, ఉప్పల్ మెట్రో డిపోల పక్కన 50కి పైగా ఎకరాలు

వ్యాపార,వాణిజ్య కార్యకలాపాలకు అవకాశం

సద్వినియోగం చేసుకోని 'ఎల్ అండ్ టీ'

## ఆరేండ్లుగా ఖాళీగానే ల్యాండ్ బ్యాంక్

### రవాణా ఆధారిత అభివృద్ధి

మియాపూర్ ప్రధాన రహదారిలో 99 ఎకరాలు, ఉప్పల్ భగాయత్‌లో 98 ఎకరాలతో పాటు రాయదుర్గం, అమీర్‌పేట, ఎర్రమంజిల్, హైటెక్ సిటీ, మూసారంబాగ్, పంజాగుట్ట ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంబడి ఎంతో విలువైన భూములను కేటాయించారు. ఆ స్థలాల్లో రెండు చోట్ల మియాపూర్, ఉప్పల్‌లో మెట్రో డిపోలను నిర్మించగా, సుమారు 50 ఎకరాలు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా మిగతా 6 ప్రాంతాల్లోని భూముల్లో 5 చోట్ల మెట్రో మాల్స్‌ను నిర్మించగా, రాయదుర్గంలో కేటాయించిన 15 ఎకరాల్లో మాత్రం కొంత మేర ఆఫీస్ స్పేస్ భవనాన్ని నిర్మించి, మిగతా స్థలాన్ని ఖాళీగా ఉంచారు. ప్రధానంగా మెట్రో డిపోల దగ్గర మిగులు భూముల్లో రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్) జరిగేలా వ్యాపార, వాణిజ్య భవనాల నిర్మాణాలను చేపట్టి వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా అలాంటి నిర్మాణాలు మెట్రో ప్రయాణికుల ఎన్నో అవసరాలు కూడా తీరుస్తాయి. కానీ ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ మాత్రం ల్యాండ్ బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకోవడం లేదు. రవాణా ఆధారిత అభివృద్ధి అనే నినాదం నిజం కావాలంటే.. ఎల్ అండ్ టీ కి కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చేపడితే రాష్ట్ర ప్రభుత్వానికి, అటు నిర్మాణ సంస్థకు ఆదాయం సమకూరుతుంది.

### నగరవాసుల అవసరాలు తీర్చేలా..

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఇంటర్ మోడల్ కనెక్టివిటీతో కూడుకున్నది. ప్రజా రవాణా వ్యవస్థలో ఎంతో సౌకర్యవంతమైన మౌలిక వసతులను కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. అందుకోసం మూడు మెట్రో కారిడార్లు నిర్మించిన మార్గాల్లోనే ప్రభుత్వం భూములను ఎల్ అండ్ టీ మెట్రోకు కేటాయించింది. ఆ భూముల్లో నగర వాసుల అవసరాలు తీర్చేలా మాల్స్, వ్యాపార, వాణిజ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తే అందరికీ ప్రయోజనంతో పాటు ప్రభుత్వానికి, మెట్రో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన ఎల్ అండ్ టీకి నిరంతరం ఆదాయం వచ్చేది. కానీ ఇప్పటికీ పదుల సంఖ్యలో మెట్రోకు కేటాయించిన భూములు ఖాళీగా ఉన్నాయి. ఎల్ అండ్ టీ మెట్రో వద్ద ల్యాండ్ బ్యాంక్ సుమారు 50-60 ఎకరాల వరకు ఉన్నా, దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతోంది.

### దశలవారీగా..

2012లో మొదలైన మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం పనులు దశలవారీగా 2017 నుంచి పూర్తవుతూ.. 2020 వరకు మొత్తం 69 కి.మీ మేర 3 మెట్రో మార్గాల్లో అందుబాటులోకి వచ్చింది. 2017 నుంచే మెట్రో రైలు సేవలు నగర వాసులకు అందుబాటులోకి వచ్చాయి. సుమారు ఆరేండ్లు గడుస్తున్నా ..రవాణా ఆధారిత అభివృద్ధి అనే లక్ష్యానికి దూరంగా మెట్రో రైలు నిలుస్తోంది. కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆదాయం రావడం లేదని పట్టణ రవాణా నిపుణులు పేర్కొంటున్నారు.


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

# నిజాంలో విద్యార్థుల నిరసన

సుల్తాన్‌బజార్: నిజాం కళాశాలలోని గర్ల్స్ హాస్టల్‌ను పూర్తి స్థాయిలో యూజీ విద్యార్థినులకే కేటాయించాలంటూ.. శనివారం చింతచెట్టు వద్ద ప్లకార్డులతో విద్యార్థినీ, విద్యార్థులు నిరసన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తమలాంటి నిరుపేదలకు హాస్టల్‌ను కేటాయించాలని నాలుగు రోజులుగా మౌనంగా నిరసన తెలుపుతున్నా.. ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని విద్యార్థునులు ఆరోపించారు. కాగా, నిరసన తెలుపుతున్న విద్యార్థులతో మాట్లాడిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా.. ఈ ఏడాది హాస్టల్ కోసం 217 మంది దరఖాస్తు చేసుకోగా, 130 మందికి వసతి కల్పించినట్లు తెలిపారు. యూజీ ద్వితీయ, తృతీయ సంవత్సరం కలిపి 300 మంది, పీజీకి చెందిన 155 మంది విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించినట్లు చెప్పారు. అయితే ప్రిన్సిపాల్ తెలిపిన వివరాలకు విద్యార్థులు సమ్మతించలేదు. పూర్తి స్థాయిలో యూజీ విద్యార్థినులకు హాస్టల్ వసతి కేటాయించేంత వరకు తమ పోరాటం ఆగదని భీష్మించుకూర్చున్నారు.

# కోహెడ కళ కళ!

లే అవుట్‌కు మెరుగులు

వేలానికి సిద్ధం చేసేలా.. మౌలిక వసతులు

సిటీబ్యూరో: హెచ్ఎండీఏ పరిధిలో భూముల వేలానికి కాంగ్రెస్ సర్కారు సన్నద్ధమవుతున్నది. హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లే అవుట్లలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులోభాగంగానే రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కోహెడ వద్ద సర్వే నం. 507లో లే అవుట్‌లో వసతులు కల్పించేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. మరో 8-10 నెలల్లోనే అభివృద్ధి చేసిన లే అవుట్ ప్లాట్లను విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొన్ని ప్లాట్లను ఇప్పటికే ఓఆర్ఆర్ నిర్వాసితులకు కేటాయించగా, మిగిలినవి అమ్మేందుకు వీలుగా తీర్చిదిద్దనున్నారు. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఈ లే అవుట్‌లో మౌలిక వసతులు కల్పనకు టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. అంతర్గత రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీరు, అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. కాగా, హెచ్ఎండీఏ పరిధిలో భూముల వేలానికి యోచిస్తున్న సర్కారు.. ఆగస్టులో సవరించిన మార్కెట్ ధరకు అనుగుణంగా ఈ వేలంలో ప్లాట్లను విక్రయించేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఆ లోపు మౌలిక వసతుల కల్పన పూర్తి చేసేలా హెచ్ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో నిర్వహించిన వేలంపాటలో మిగిలిన ప్లాట్లను కూడా మార్కెట్‌లో పెట్టనున్నారు.






బేగంపేటలోని ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

# 'ఓలాకు హటావో.. జాన్‌కు బచావో'

బేగంపేట, ఆగస్టు 3: ఓలా ఎలక్ట్రిక్ బైక్‌ల్లో అనేక సాంకేతిక లోపాలు తలెత్తి నష్టపోతున్నామంటూ బాధితులు శనివారం బేగంపేటలోని ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూం ఎదుట ఆందోళనకు దిగారు. 'ఓలాకు హటావో.. జాన్‌కు బచావో' అంటూ నినాదాలు చేశారు. ఓలా బైక్‌లు కొనుగోలు చేసిన బోయినపల్లికి చెందిన ఈశ్వర్‌తో పాటు మరికొందరు బాధితులు బైక్‌ల్లో చాలా వరకు సాఫ్ట్‌వేర్ సమస్యలు వస్తున్నాయంటూ.. షోరూం నిర్వాహకులు, కంపెనీ యజమానులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అయినా యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. అలాగే సర్వీస్, మాన్యుఫాక్చరింగ్ సమస్యలు కూడా అధికంగా ఉన్నాయన్నారు. బైక్‌లు రన్నింగ్‌లో ఆగిపోతున్నాయని, ట్రాఫిక్‌లో ప్రాణాల మీదకు వచ్చిన ఘటనలు అనేకం ఉన్నాయని చెప్పినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది గాయాల పాలైనట్టు బాధితులు వివరించారు.

# ఒకే నంబర్‌తో.. రెండు రాష్ట్రాల్లో రయ్..రయ్..

శంషాబాద్ రూరల్, ఆగస్టు 3: ఏండ్ల నుంచి రెండు రాష్ట్రాల్లో ఒకే నంబర్‌తో ఓ వ్యక్తి క్యాబ్‌ను నడిపిస్తున్నాడు. కొందరు క్యాబ్ డ్రైవర్లు అతడిని గుర్తించి.. పట్టుకున్నారు. స్థానిక క్యాబ్ డ్రైవర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 26టీఈ 4974తో ఏపీలో.. అదే నంబర్‌తో తెలంగాణలో టీఎస్ 26 టీఈ 4974 నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఓ వ్యక్తి.. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులను తీసుకెళ్తున్నాడు. అయితే వారం రోజుల నుంచి విమానాశ్రయానికి ఒకే వ్యక్తి రెండు మూడు సార్లు తిరుగుతుండటంతో అనుమానం వచ్చిన శంషాబాద్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్లు..అతడిని పట్టుకోవడంతో అసలు విషయం బయటపడింది. కారుతో పాటు డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. విచారణ చేసి..చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు చెప్పినట్లు క్యాబ్ డ్రైవర్లు తెలిపారు. పట్టుబడిన సదరు వ్యక్తి దాదాపు పదేండ్ల నుంచి ఇలాగే తిరుగుతున్నట్లు వివరించారు. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఏ అధికారులను కోరారు.

